క్లుప్తంగా

నేడు సమీక్షా సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ టీఏలకు సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హరితహారంలో భాగంగా మొక్కల పంపిణీ, గుంతలు తవ్వడం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, ఆర్వోఎఫ్ఆర్ నామినీ వివరాలు, తదితర వివరాలపై సమీక్ష ఉంటుందన్నారు.

విద్యా సామగ్రి అందజేత

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో ప్రాథమికోన్నత, తేలివాడ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సేయింట్ పెట్రోనిల ట్రస్ట్, జర్మనీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోట్‌పుస్తకాలు, ఆట సామగ్రి పంపిణీ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రింటర్ అందజేశారు. గతంలో ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన జ్యోతి ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు అనేక సౌకర్యాలు కల్పించారు. తేలివాడ ప్రధానోపాధ్యాయుడు పాండురంగ, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపాల్ చక్రపాణి విద్యా సామగ్రి పంపిణీ చేశారు. నూతనంగా ప్రవేశాలు పొందిన 21 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు, టెక్స్ట్ బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, కాస్మోటిక్స్, బెడ్ కవర్, టవల్, స్కూల్ బ్యాగులు అందజేశారు.

కెరమెరి: మండలంలోని సావరఖెడా గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు కడేర్ల రంగయ్య మిత్రులు రూ.30 వేల ఖరీదు చేసే నోటు పుస్తకాలు విరాళంగా అందజేశారు. బుధవారం రంగయ్య నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. నవీన్ కుమార్, శ్రీనివాస్, సతీష్, రజినీకర్, పురుషోత్తం రెడ్డి, సురేశ్, మార్కెండేయ, సుధాకర్, జ్ఞానేశ్వర్, నర్సింగ్, గోపి, రవిత, రమేశ్ విరాళం అందజేసిన వారిలో ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, భోజన వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, ఎస్‌వో ధర్మయ్య, సోను, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల పద్మశాలీ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశాలీ సంఘం సిర్పూర్(టి) మండల అధ్యక్షుడు దాసరి వినోద్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి ప్రశాంత్, కోశాధికారి బత్తుల చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్, అల్లె రవికుమార్, పసునూరి కార్తీక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మొరె సంపత్‌కుమార్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు దాసరి వెంకటేష్, కాగజ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

'రైతుబీమా'కు దరఖాస్తు చేసుకోవాలి

కెరమెరి: రైతుబీమా పొందేందుకు రైతులు దరఖాస్తు చేయాలని ఏఈవో అఖిల్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా పాస్ పుస్తకాలు అందిన రైతులు దరఖాస్తులు చేయడానికి ఆగస్టు 5వ తేదీవరకు గడువు ఉందన్నారు. పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

బెజ్జూర్: రైతుబీమా కోసం అన్నదాతలు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో రవితేజ అన్నారు. బుధవారం మండలంలోని రెబ్బెన గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతులు, పోడు పట్టాదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వంట మాస్టర్లుగా ఉపాధ్యాయులు



గుండాయిపేట పాఠశాలలో వంట చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వం బిల్లులు విడుదల చేయడం లేదని జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు విధులు బహిష్కరించి మూడు రోజులుగా టోకెన్ సమ్మె చేస్తున్నారు. పాఠశాలల్లోని హెచ్ఎంలు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వంటలు వండించి పిల్లలకు భోజనం అందించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై పడింది. ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న క్రమంలో వంటలు చేసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో బుధవారం కౌటాల మండలం గుండాయిపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గావుడె హన్మంతు, ఉపాధ్యాయుడు శ్యామ్‌సుందర్ వంటలు చేసి పిల్లలకు వడ్డించారు.



ఎలుకపల్లి చేతిపంపు వద్ద నిలిచిన మురికి నీరు

వానాకాలం.. జర పైలం!

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- లోపిస్తున్న పారిశుధ్యం
- చెత్తతో నిండిన మురికి కాల్వలు
- పట్టించుకోని అధికారులు



ఎలుకపల్లి గ్రామంలో లోపించిన పారిశుధ్యం

బెజ్జూర్: వానాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఆయా గ్రామాల్లోని పాలకవర్గాలు సైతం రోగాలు రాకుండా చర్యలు తీసుకోవాలి. ఇళ్ల చుట్టూ ఖాళీ స్థలాలుంటే నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంట్లో ఉండే ట్యాంకులు, నీటి తొట్టీలపై మూతలు పెట్టాలి. గ్రామాల్లో ఉండే మంచి నీటి ట్యాంకులను కనీసం మూడు, నాలుగు రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని వైద్యులు ప్రజలకు సూచిస్తున్నారు.

లోపిస్తున్న పారిశుధ్యం..

జిల్లాలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తుంది. చాలా గ్రామాల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురికి కాల్వలు, నివాస ప్రాంతాల సమీపంలో తాగి పడేసిన కొబ్బరి బోండాలు, నిరుపయోగంగా ఉన్న కూలర్లలో దోమలు విపరీతంగా ఉండే అవకాశం ఉంది. వర్షాకాలంలో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండడంతో పాటు కొంత అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వానాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి. వీలైనంత వరకు కాచి వడబోసిన నీళ్లు తాగాలి. దగ్గు, జ్వరం, జలుబు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.
– అవినాశ్, వైద్యుడు, సామాజిక ఆరోగ్య కేంద్రం

ఇవి పాటిస్తే మేలు..

- మురికి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తీసివేయించి మురుగు నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలి.
- మురుగు నీటిని తొలగించిన తర్వాత కాలువ వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి.
- దోమల నివారణకు మందులు పిచికారీ చేయించాలి.
- తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటూ రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించి మరుగుదొడ్లను వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- గ్రామాల్లో కొబ్బరి బోండాల వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు మిగిలిన చెత్తను పరిసరాల్లో వేయకుండా తగలబెట్టేలా చర్యలు తీసుకోవాలి.
- సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది సూచనలు పాటించాలి.
- ప్రతీరోజు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. నిల్వ ఉంచిన వాటిని తినకూడదు.
- సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వర్షాకాలంలో వీలైనంత వరకు మాంసాహారానికి దూరంగా ఉండాలి. వంట పాత్రలపై ఎల్లప్పుడు మూతలు ఉండేలా చూసుకోవాలి.
- జ్వరం, దగ్గు, తలనొప్పి వంటి నొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి.

వైద్యాధికారిని నియమించాలని వినతి



కలెక్టర్‌కు నివేదిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి, స్టాఫ్ నర్సులను నియమించాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయిలు కలెక్టర్ హేమంత్ బోర్కడేను కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన కలెక్టర్ గురువారం ఉదయం 9 గంటల్లోగా పీహెచ్‌సీలో వైద్యాధికారి విధుల్లో ఉంటారని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు జగన్నాథ్, గుణవంత్‌రావు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

కౌటాల: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందిస్తామని సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఈశ్వరయ్య అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ మండలాల్లో విద్యుత్ వినియోగదారుల నుంచి 59 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో అధికారులు 40 సమస్యలను వెంటనే పరిష్కరించగా, మిగతా 19 సమస్యలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ రాజేశ్వర్, ఏఈ రవీందర్, వేదిక సభ్యులు అశోక్, కిషన్, భూమారెడ్డి, సిబ్బంది రవి, వినోద్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళనలు



జిల్లా కేంద్రంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కెరమెరిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కెరమెరి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం కెరమెరి బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి మాట్లాడారు. రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు చేస్తామని ప్రకటించడం అనాలోచిత నిర్ణయమన్నారు. ఎంపీటీసీ ఇష్తేకర్, సర్పంచ్‌లు బైనాబాయి, జగన్నాథ్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావు, నాయకులు ఉత్తం, యూనుస్, బాలాజి తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దహనం చేశారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ వద్దన్న రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆదే వసంత్‌రావ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ నికాడే గంగారం, సర్పంచులు మౌనిశ్, సోమయ్య, శ్రీనివాస్, రమేశ్, రాందాస్, కుశబ్‌రావ్, నాయకులు మధుకర్, తిరుపతి, ఆనంద్‌రావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: రైతులకు అందించే ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి మాట్లాడుతూ రేవంత్ వ్యాఖ్యలు తెలంగాణ రైతాంగాన్ని కించపర్చేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్: కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని మరోసారి నిరూపితమైందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు అలిబిన్ అహ్మద్, బాలేశ్‌గౌడ్, బాపూరావు, గోపాల్, తారీక్, కార్తీక్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేకి అని రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ కొండ్ర జగ్గాగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, ఉపసర్పంచ్ రాజేశ్, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్ గౌడ్, యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, జావిద్, మహేష్, భీమన్న, రంగు సురేష్ గౌడ్, శంకర్, కేశవ్, మతిన్, వెంకటి, నారాయణ, నారాయణ, వైకుంఠం, షకీల్, శ్రీకాంత్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదన్న కాంగ్రెస్ పార్టీకి రైతులే బుద్ధి చెబుతారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. బుధవారం జైనూర్‌లో ప్రధాన రహదారిపైన రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ సౌందర్య, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో మంగళవారం రాత్రి వర్షానికి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో స్తంభం విరిగిపోయింది. దీంతో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించాలి

రెబ్బెన: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం కోరారు. బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హరితహారం పేరుతో ప్రభుత్వం అనేక ప్రాంతాల్లో కోనో కార్పస్ మొక్కలు నాటిందన్నారు. ఈ మొక్కలు మానవజాతికి ఎంతో ప్రమాదకరమని పరిశోధకలు చెబుతున్నా ప్రభుత్వం తొలగించడం లేదని విమర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శి శివ, మండల సహాయ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమ కోసం నాబార్డు

ఆసిఫాబాద్‌రూరల్: రైతుల సంక్షేమ కోసం నాబార్డు పని చేస్తుందని నాబార్డు డీడీఎం వీర భద్రుడు అన్నారు. బుధవారం నాబార్డ్ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొటగూడ గ్రామంలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించి మొక్కలు నాటారు. వాసన్ సంస్థ ప్రతినిధులు రవీందర్, తిరుపతి, లక్ష్మణ్, అంబారావు, టీచర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు జీఎం కార్యాలయం నుంచి గోలేటి ఎక్స్‌రోడ్ వరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గతంలో గోలేటికి ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఎస్‌వోటూజీఎం నరేందర్, ఫిట్ కార్యదర్శి మంకయ్య పాల్గొన్నారు.

బీసీల రాజకీయ ప్లీనరీ విజయవంతం చేయాలి

వాంకిడి: బీసీలకు రాజకీయ అధికారమే లక్ష్యంగా ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే రాజకీయ ప్లీనరీకి మండలంలోని బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడె లహుకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ప్లీనరీ పోస్టర్లను బీసీ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. లోబడె తిరుపతి, ఉమేష్, నిఖిల్, సురేశ్, దినేశ్, వినేశ్, సునీల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కౌటాల: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దహెగాం: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్ అందించిన మొదటి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పార్టీ మండల నాయకులు బొర్కుట్ విఠల్, దేవాజీ, సత్యనారాయణ, బాలరాజు, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్క మోహన్, తోగెశ్, గందె వెంకటేశ్, రవి, శంకరి, వెంకటేశ్, గణపతి పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం..

తిర్యాణి: రాహుల్‌గాంధీపై ఎంపీగా అనర్హత వేటు వేసినందుకు నిరసనగా చేపడుతున్న సత్యాగ్రహ దీక్షను నీరుగార్చాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అంశాన్ని తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్ ఆరోపించారు. టీపీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. యూత్ అధ్యక్షుడు పున్నం హరీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరుమండ్ల వెంకటేశ్, అమర్, సురేశ్, రాజు తదితరులు ఉన్నారు.



రెబ్బెన: కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, మాజీ జెడ్పీటీసీ సోమయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోషం, నాయకులు పాల్గొన్నారు.

శ్రమకు తగ్గ గుర్తింపు ఇవ్వాలి



కౌటాల: నినాదాలు చేస్తున్న కార్మికులు

కెరమెరి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు, కారోబార్లకు పనికి తగ్గ వేతనం ఇస్తూ వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జీపీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెందోర్ రాజేశ్వర్, సెడ్మకి తుకారాం, జీపీ కార్మికులు రాందాస్, వెంకన్న, నరేశ్, క్రిష్ణ, అనిల్‌కుమార్, సంతోష్, స్వామి, నగేశ్, వాసుదేవ్, శ్రీకాంత్, రమేశ్, రాజు తదితరులు ఉన్నారు.

కౌటాల: ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం కొనసాగింది. కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు మోరేశ్వర్, నాగేశ్, కరుణాకర్, బానీశ్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: పంచాయతీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారం ఏడో రోజుకు చేరింది. సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ రైల్వే మెయింటనెన్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన సీహెచ్‌పీ డీజీఎం భీంరావ్ జాడే, ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్‌లు రెండు రోజుల్లో కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చంద్రయ్య, రాజన్న, శోభన్, వెంకటేష్, కిరణ్, మహేందర్, పోచయ్య, వినోద్, మారుతి, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



దహెగాం: పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దహెగాం: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు తెలిగే హరీశ్ మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దందా కొనసాగుతున్నా ప్రభుత్వం నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సందీప్, రజినీకాంత్, సంజీవ్, సంతోష్, సాయి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కొండ సాయిరామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సంఘం బెజ్జూర్ మండల అధ్యక్షుడు సూర్ల కల్యాణ్, మేకల గణేశ్, గుమ్ముల కార్తీక్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్షాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలు, కళాశాలల బంద్ కాగజ్‌నగర్‌లో విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భీమేశ్ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన ఉష్టబోయిన వెంకటి మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు క్రిష్టారావు, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, సర్పంచులు సంజీవ్, సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి ఉన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య సోదరి నేతుల పుల్లక్క(70) అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాళులర్పించి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్ ఉన్నారు.